క్లుప్తంగా

ప్రభుత్వ విద్యార్థినుల ప్రతిభ


అశ్విత (977)

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం బుధవారం తెలిపారు. తాటి అశ్విత బైపీసీ 977, ఎంపీసీలో సౌజన్య 931, వాడపల్లి జాస్మిన్ 920 మార్కులు సాధించారు. తోట సౌమ్య 441 మార్కులు, 100 మందికిపైగా ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

కొత్తగూడ: గిరిజన సంక్షేమ శాఖలో అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో బోధన, బోధనేతర, హెచ్‌డబ్ల్యూఓలుగా అక్రమ పద్ధతిలో డిప్యూటేషన్లపై పని చేస్తున్నారనిన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి నూతన విద్యా సంవత్సరంలో ఎవరి స్థానంలో వారే కొనసాగే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో విజయ్, సాంబయ్య, సురేందర్, లక్ష్మీనారాయణ, నరేష్, సారంగపాణి పాల్గొన్నారు.

పోలీస్ కళాజాతా

గార్ల: మూఢనమ్మకాల నుంచి ప్రజలను చైతన్య పర్చేందుకు గ్రామాల్లో పోలీస్ కళాజాతా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని గార్ల–బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా అన్నారు. మంగళవారం రాత్రి మండలం వెంకటాపురం తండాలో జిల్లా పోలీసుల కళాబృందం నిర్వహించిన కళా ప్రదర్శనలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువకులు చెడువ్యసనాలకు మానుకొని, సన్మార్గంలో పయనించినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యుడు, హెడ్ శ్యామ్, కానిస్టేబుళ్లు శ్రీను, సుధాకర్, సిరాజ్, హోంగార్డులు శ్రీను, రాము పాల్గొన్నారు.

ప్రవేశాలు ప్రారంభం

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమడూరు గ్రామశివారులో ఉన్న పురుషుల బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ బుధవారం తెలిపారు. ఈనెల 24 నుంచి అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలి

గార్ల: గార్ల–డోర్నకల్ మధ్య గల రైల్వేగేటు మూసివేసతతో ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్‌ఎం గోపాలకృష్ణకు గార్ల మండల అఖిలపక్షం నాయకులు వినతిపత్రం అందజేశారు. గార్ల మండలం బుద్దారం సమీపంలో రైల్వేగేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను బుధవారం రైల్వే ఏడీఆర్‌ఎం పరిశీలించారు. కందునూరి ఈశ్వర్‌లింగం, రాధాకృష్ణ, పృథ్వీరాజ్‌నాయక్, రాజు, ప్రభాకర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మరిపెడ రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ యువజన నాయకుడు నూకల అభినవ్‌రెడ్డి అన్నారు. బుధవారం మరిపెడ ఉల్లెపల్లి గ్రామంలో మల్లికార్జున ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకుడు విజయ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్, మల్యాల కళాధర్, పెద్దబోయిన శ్రీను, శ్యామ్, శ్రీనివాసచారి, చలమల శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటమల్లు, గుడిసె శ్రీను, పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కురవి: తహసీల్దార్‌గా శ్వేత బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె ఇటీవల గూడూరు మండల తహసీల్దార్‌గా పనిచేసి కురవికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సునీల్‌కుమార్ దంతాలపల్లి తహసీల్దార్‌గా వెళ్లారు.

మొబైల్ ఏటీఎం సేవలు అదుర్స్



మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలో మొబైల్ ఏటీఎం సేవలు బుధవారం కల్పించారు. మండల కేంద్రంలో ఎక్కడైతే ప్రజల సమూహం ఉంటుందో అక్కడికి ఈ మొబైల్ ఏటీఎం వాహనాన్ని వచ్చి నిలుపుతున్నారు. సేవలు అదుర్స్ అంటు పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు

- రోడ్లపైనే ఆటోలు, తోపుడు బండ్లు, వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్, పోలీస్ శాఖ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత, కొత్త బజారులో రోడ్డు ఆక్రమించి వ్యాపారం చేస్తుండడంతో వాహనాలకు, ఖాళీ నడకన వెళ్లే ప్రజలకు ప్రమాదకరంగా మారింది. ఐదేళ్ల క్రితం మానుకోట పట్టణాన్ని దాదాపు రూ.50కోట్లతో పాత కొత్త బజార్‌లో రోడ్లు, లైటింగ్, డివైడర్లు నిర్మించి సుందరీకరణ చేపట్టారు. ప్రధానమైన రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ఉన్న ప్రాంతాల్లో మాత్రం ఈ సుందరీకరణకు తర్వాత కూడా రోడ్లపై ఎటు చూసిన తోపుడు బండ్లు, వాహనాలు పార్కింగ్‌లో సగం రోడ్డు కనిపించకుండా పోయింది. ప్రస్తుతం పట్టణం జనాభాతోపాటు వ్యాపార సంస్థలు రోజురోజుకు విస్తరించాయి. అంతే వేగంగా ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. నిత్యం 10వేలకు పైగానే వాహనాలు తిరుగుతాయి. రైల్వేస్టేషన్ సెంటర్, నెహ్రూ సెంటర్, ఇల్లెందు బైపాస్ రోడ్డు వైఎస్సార్ జంక్షన్‌లో రోడ్డు మధ్యలో పెద్ద డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లు వెడల్పు తగ్గిపోగా ఇరువైపులా వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చే వాహనాదారులు షాపుల ముందే బండ్లు పెడుతున్నారు. మరోపక్క సగం రోడ్డును ఆక్రమించుకొని తోపుడు బండ్లు చిరువ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లోడింగ్ అన్ లోడింగ్ చేస్తూ ట్రాఫిక్ కొత్త సమస్య తీసుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు రైళ్ల రాకపోకల సమయంలో రైల్వేస్టేషన్‌లో కృష్ణ, ఇంటర్‌సిటీ, ఈస్ట్‌కోస్ట్, గోల్కొండ రైలు వచ్చినప్పుడు పాత, కొత్త బజార్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా పెరిగిపోతుంది. దీనికి ప్రధానంగా పండ్ల వ్యాపారులు, తోపుడు బండ్లు, ఆటోలు ఇష్టానుసారంగా రోడ్లపైనే అమ్మకాలు చేస్తుంటారు. ట్రాఫిక్ ఎస్సై, సిబ్బంది దృష్టి సారించాలని పలువురు ప్రయాణికులు కోరుకుంటున్నారు.


కూరగాయల మార్కెట్ అడ్డంగా ఉన్న తోపుడు బండ్లు, ఆటోలు


వివేకానంద సెంటర్‌లో ఉదయ్ కిరాణం షాప్ దగ్గర ట్రాఫిక్ జామ్


సూర్య థియేటర్ సమీపంలో రోడ్డుపైన నిల్వ ఉంచిన ఇసుక

ట్రాఫిక్‌ను నియంత్రించాలి



మానుకోటలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రహదారులు ఇరుకుగా ఉండడంతో వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివేకానంద సెంటర్, శ్రీనివాస థియేటర్ సెంటర్, మదర్ థెరిసా సెంటర్, ఇల్లందు బైపాస్ జంక్షన్ రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుంది. అధికారులు దృష్టి సారించి ట్రాఫిక్ నియంత్రించాలని అందించాలని కోరుకుంటున్నాను.

– పల్లె సందీప్, మానుకోట

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నర్సింహులపేట: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో ప్రతీ ఒక్క కార్యకర్త ఐక్యతతో పని చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అనంతరం మాల మహానాడు నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ గణేష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ యాకయ్య పాల్గొన్నారు.


నర్సింహులపేట: చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలి

దంతాలపల్లి: మండలం కేంద్రంతోపాటు మండల పరిధిలోగల గ్రామాలలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి, రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే రామచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్టునాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాము, నాయకులు లింగారెడ్డి, కొమ్మినేని రవీందర్, వెంకటనారాయణ, జానిపాష, నెమ్మతి యాకన్న, సతీష్, సురేష్ పాల్గొన్నారు.

భూ భారతితో రైతులకు మేలు

డోర్నకల్: రాష్ట్ర పభుత్వం అమలు చేస్తున్న భూ భారతితో రైతులకు మేలు చేకూరుతుందని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతాంగానికి మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి సమర్థవంతంగా అమలు చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలోని విజయా ఫంక్షన్ హాలులో నేడు గురువారం సాయంత్రం 4గంటలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు రైతులతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ప్రభుత్వ విప్ కోరారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి


గార్ల: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


డోర్నకల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ..

కశ్మీర్‌లో ఉగ్రవాదులు యాత్రికులపై జరిపిన కాల్పులను నిరసిస్తూ బుధవారం రాత్రి బీజేపీ, ముస్లింల ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు.

– డోర్నకల్/కేసముద్రం/మహబూబాబాద్ అర్బన్/దంతాలపల్లి/గార్ల/ గూడూరు


గూడూరులో..

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

మహబూబాబాద్ అర్బన్: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్పుతో సుమారు 26 మందిని ఇష్టం వచ్చినట్లు కాల్పులు చేయడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మూడుకోట్ల సెంటర్‌లో బుధవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను సీపీఐ నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా విజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వార్డు కౌన్సిలర్ అజయ్‌సారథిరెడ్డి, నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుట్ల వెంకన్న, సందీప్, వెంకన్న పాల్గొన్నారు.


మహబూబాబాద్ అర్బన్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండించాలి

గూడూరు: పాకిస్తాన్ ఉగ్రవాద దుశ్చర్యలను ప్రతీ ఒక్కరు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జమ్మూ కశ్మీర్‌లో హిందూ పర్యాటకులపై చేసిన దాడిలో 26మందికి పైగా దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. కులం పేరుతో ఉగ్రవాదులు చేస్తున్న దమణకాండకు ప్రతీకార చర్యపై చర్యలు చేపట్టి కేంద్రం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని వారు కోరారు.

పనివేళల్లో మార్పులు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో రకరకాల పనులు చేస్తున్న గ్రామ పంచాయతీ (జీపీ) కార్మికులకు పని వేళల్లో మార్పులు చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13వేల గ్రామపంచాయతీలలో 62వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు ఎండదెబ్బతో ప్రాణాపాయ పరిస్థితి ఉందన్నారు. ఈనేపథ్యంలో పనివేళల్లో మార్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, మధు, సూరన్న, బాలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఉరివేసుకొని మహిళా ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: ఉరివేసుకుని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలాఉనాయి.. జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన మహిళ భర్త కొద్ది నెలల క్రితం మృతి చెందగా ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా ఆమె మానసిక స్థితి బాగోలేక ఆందోళనకు గురవుతున్న క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కాలనీవాసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పుస్తెలతాడు చోరీ

దంతాలపల్లి: నిద్రపోతున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై పిల్లల రాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీరిశెట్టిగుడె గ్రామ చివారు పంతులు తండాకు చెందిన బానోత్ మమత, తన భర్త శేఖర్ ఇంటి ఆరుబయట నిద్రపోతున్నారు. ఈక్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు మమత మెడలోని మూడు తులాల పుస్తెల తాడు, పక్కనే ఉన్న రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు

బైక్ కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చిన్నగూడూరు: బైక్ కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని ఉగ్గంపల్లి శివారులో బుధవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం యాచారం గ్రామానికి చెందిన గొలుసుల శ్రీనివాస్ కారులో నర్సింహులపేట నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్నారు. అదే సమయంలో ఇనుగుర్తి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పందుల సురేష్, అనితలు బైక్‌పై ఉగ్గంపల్లి నుంచి నర్సింహులపేటకు వెళుతున్నారు. ఈ క్రమంలో ఉగ్గంపల్లి శివారులో కారు బైక్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సురేష్, అనితలకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి


మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు సన్మానం


దంతాలపల్లి: దాట్ల ప్రాథమిక పాఠశాలలో ప్రగతి పత్రాలతో విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల హెచ్‌ఎం జి.ఉప్పలయ్య అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లితండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమమంలో ఉపాధ్యాయులు సోహెన్, శ్రీధర్ రెడ్డి, శ్రీనువాసరావు, తిరుపతి, శిభారాణి పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్‌తో మీటింగ్‌లు పెట్టి విద్యా సంవత్సరానికి వీడ్కోలు పలికారు. విద్యార్థుల మార్కుల లిస్టును తల్లిదండ్రులకు అందజేశారు.


మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ ప్రైమరీ పాఠశాలలో ఐద తరగతి విద్యార్థులుకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను హెచ్‌ఎం హల్యా, ఉపాధ్యాయులు బాలాజీ నాయక్ అందజేశారు.

దంతాలపల్లి: మండలం దాట్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఐదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి, ప్రగతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతల సురేష్, మానస, అనిత, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

- పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి

గూడూరు: క్రీడల్లో రాణించిన వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నూనావత్ ధన్‌రాజ్ స్మారకార్థం బాలుడి తండ్రి మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. క్రీడలో రాణించిన మొదటి జట్టుకు రూ.30వేలు, ద్వితీయ బహుమతి నగదు రూ.20వేలు, తృతీయ బహుమతి నగదు రూ.10వేలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి, యాకూపాషా, వెంకన్న, సమ్మక్క పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ లింగారెడ్డి

పోస్ట్‌మార్టం గదిని ప్రారంభించాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిర్మించిన పోస్ట్‌మార్టం గదిని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరుతూ బుధవారం పోస్ట్‌మార్టం గది ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు కందునూరి శ్రీనివాస్ మాట్లాడారు. మండలంలో ఎవరైన ప్రమాదవశాత్తు, రైలు ప్రమాదాల్లో మృతి చెందితే మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు సుమారు 50కిలోమీటర్ల దూరంలో గల మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తూ నిరుపేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీహెచ్‌సీ వైద్యుడు హనుమంతరావుకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, అంబటి వీరస్వామి, మౌలానా, పద్మ పాల్గొన్నారు.

ఘన నివాళి

మరిపెడ రూరల్: మండలంలోని తాళ్లఊకల్ గ్రామానికి చెందిన సీపీఎం గ్రామ కార్యదర్శి పుల్లూరు దేవయ్య మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, అల్వాల వీరయ్య అన్నారు. బుధవారం మండలంలోని గ్రామంలో దేవయ్య మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

తొర్రూరు రూరల్: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పీఏసీఎస్ డైరెక్టర్ కాల్వకోలన్ జనార్దన్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని పత్తేపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ ప్రశాంత్, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కంప్యూటర్ తరగతులు ప్రారంభం

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల ప్రభుత్వ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ తరగతులను ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దర్గయ్య, స్కూల్ చైర్మన్ శోభారాణి, ఉపాధ్యాయులు లత, అనురాధ, శ్రీనివాస్, సరిత, రమేశ్, అశోక్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ క్రాంతికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, దేవేందర్, లక్ష్మణ్, అనిల్, రమాదేవి, తార, శ్రీను, శేఖర్, లావణ్య పాల్గొన్నారు.

సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కురవి: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను బీఆర్‌ఎస్ నాయకుడు గుగులోత్ రాంలాల్ నాయక్ బుధవారం మండలంలోని బలపాల శివారు లింగ్యాతండా గ్రామంలో ఆవిష్కరించారు. ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరగబోయే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు అధికసంఖ్యలో కార్యకర్తలు, తెలంగాణ వాదులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి

డోర్నకల్: వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని మండల విద్యాధికారి ఆంగోత్ లక్ష్మానాయక్ కోరారు. మండలంలోని తొడేళ్లగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తక పఠనం, క్రీడా సాధన లాంటి వాటి కోసం సమయం కేటాయించాలని కోరారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

బయ్యారం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతి పేదవానికి ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంత మందికే ఇళ్లు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రభాకర్, మురళీ, శేషు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డులో రోడ్డు వెడల్పులో ఇళ్ల స్థలాలు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు నాగేశ్వర్‌రావు, సదానందం, శివ బుధవారం కోరారు.

సన్మానం

గార్ల: గార్ల బాలికోన్నత పాఠశాలలో మినీ ఆడిటోరియం నిర్మాణానికి కృషి చేసిన విశ్రాంత ఎంఈఓ రాంప్రసాద్, విశ్రాంత ఉద్యోగి ఎడ్ల అప్పయ్యలను బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం సుందర్‌కుమార్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సురేందర్ రెడ్డి, మంజుల, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్, బెంచీల అందజేత

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, ఉప్పరపల్లి పీఎస్, జెడ్పీ హైస్కూల్‌లకు మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ తీగలవేణి ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లు, 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మైన్స్ మేనేజర్ మూల వినయేందర్‌రెడ్డి, ఎకౌంట్స్ మేనేజర్ గొండ్ల మల్లయ్య, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎస్.నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు వెళ్లిన విద్యార్థినులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఏపీ రాష్ట్రంలోని ఒంగోలులో జరుగనున్న క్లస్టర్ స్థాయి ఖోఖో క్రీడలకు బుధవారం వెళ్లారు. ఉపాధ్యాయురాలు టాన్జిస్, విద్యార్థినులు వర్షిత, పవిత్ర, బిందు జాహ్నవి, లక్ష్మిప్రసన్న, ఖుషిత, దివ్య, ఆశ్విత, కుసుమతేజస్వి, అక్షర, శ్రీనిత, రక్షిత వెళ్లారు.

గీత కార్మికుల జోలికి వస్తే ఊరుకోం..

దంతాలపల్లి: గీత కార్మికుల జోలికివస్తే ఊరుకోమని మండల గీత కార్మికులు అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గీత కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామబాద్ జిల్లా తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ సంఘం మహిళలను ఆలయంలోకి రానివ్వకపోవడం అమానుష చర్య అన్నారు. కార్యక్రమంలో అనిల్, లింగయ్య, అంతయ్య, రమేశ్, యాకన్న పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మరిపెడ: ప్రభుత్వ దవాఖానలోనే అధిక శాతం ప్రసవాలు జరిగేలా చూడాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు గుగులోతు రవి వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మరిపెడ పీహెచ్‌సీ ఆవరణంలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ గర్భిణిని ప్రభుత్వ దవాఖానాలో మొదటి మూడు నెలలో పేరు నమోదు చేయాలన్నారు. ప్రతి బుధవారం, శనివారంలో పిల్లలకు ఇచ్చే వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, సూపర్‌వైజర్స్ కృష్ణ, సుదర్శన్, మాధవి, లక్ష్మి, సిబ్బంది అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీష్, సాయిశ్రీ, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

సూర్యాస్తమయం కనువిందు



మహబూబాబాద్ రూరల్: వేసవికాలం ఎండలు అధికమవ్వడంతో భూమండలం వేడెక్కుతున్న విషయం తెలిసిందే. కాగా సంధ్యా సమయంలో మాత్రం ఆకాశం కొంత మేరకు మేఘావృతమైనట్లు కనిపిస్తుండగా సూర్యాస్తమయ వేళ మండే సూర్యుడు కాంతించిన మాదిరిగా చందనపురంగులో ఆకాశంలో కనువిందుచేశాడు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయ సమీపంలో కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646